క్లుప్తంగా

గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో తనిఖీ



పాలకుర్తి: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఎంపీడీఓ రాములు, హౌజింగ్ డీఈ సాయిరాంరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్ రూం, కిచెన్‌ను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు భోజనం చేశారు. ప్రిన్సిపాల్ రేణుకా రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

'జయప్రదం చేయాలి'

జనగామ రూరల్: జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్ నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సంఘం జాతీయ మహా సభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పైస రాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో ఆయన మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు ఆది సాయన్న, సంఘం జిల్లా అధ్యక్షుడు కలకోట ప్రబాకర్, ఎల్లయ్య, నర్సయ్య, శ్రీను, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలి



జనగామ రూరల్: మెప్మాలో పని చేస్తున్న ఆర్పీలకు జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రదాన కార్యదర్శి సుంచు విజేందర అన్నారు. ఈ మేరకు గురువారం ఆర్పీలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఈఓ మన్సూరీకి వినతి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్పీలు పాల్గొన్నారు.

'కార్యదర్శి వేధింపులను అరికట్టాలి'




చిల్పూరు: గ్రామ పంచాయతీ కార్యదర్శి వేధింపులను అరికట్టాలని జీపీ సిబ్బంది కోరారు. ఈ మేరకు పల్లగుట్ట జీపీ ఎదుట గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కార్యదర్శి బాపు నాయక్ చెప్పిన పనులన్నీ చేస్తున్నా ఆరు నెలలుగా ఏదో ఒక సాకుతో తమను వేధిస్తున్నాడన్నారు. బుధవారం పనులు చేస్తుండగా అందరి ముందు అసభ్యకరంగా మాట్లాడి, బూతులు తిట్టాడని తెలిపారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు తెలియజేయడంతో పాటు అతనిపై అధికారులు విచారణ చేపట్టి వేధింపులకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కారోబార్ జీడీ ఆనందం, కేశోజు వెంకట్రాజం, రాజేష్, రాజయ్య, భాగ్యమ్మ, రజిత, వెంకటయ్య, సాయిమలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

జనగామ రూరల్: ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన గురువారం కోర్రతండా వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్మెట మండలంలోని బొమ్మకూర్ రాళ్లబాయి తండాకు చెందిన ఆటో డ్రైవర్ ఇస్లావత్ నవీన్ (30) జనగామ నుంచి ఆటోలో నర్మెటకు వెళ్తున్నాడు. జనగామ మండలం కోర్రతండా సమీపంలో నర్మెట నుంచి వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టడంతో నవీన్ రోడ్డుపై పడి అక్కడిక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి..



కన్నయ్య(ఫైల్)

చిల్పూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మండలంలోని వంగాలపల్లి గ్రామానికి చెందిన ఆవుల కన్నయ్య (35) పాల వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగా ద్విచక్రవాహనంపై ఐదు రోజుల క్రితం పాలు తీసుకుని హనుమకొండకు బయలుదేరాడు. హనుమకొండలోని నిట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. కాగా, కుటుంబ సభ్యులు అతని అవయవాలను దానం చేశారు. మృతుడికి భార్య రజిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

నిరుపయోగంగా హాస్టల్ భవనం

- రూ.లక్షలు వెచ్చించి లక్షణంగా వదిలేశారు
- తాటికొండలో శిథిలావస్థకు చేరుకున్న భవనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



శిథిలావస్థకు చేరుకున్న తాటికొండలోని హాస్టల్ భవనం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలో ఎంతో ఘనమైన చరిత్ర ఉన్న తాటికొండ గ్రామంలో ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్ భవనం నిరుపయోగంగా మారి దాదాపు పదేళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. భవనం నిరుపయోగంగా మారి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడం అధికారులు, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనానికి నిదర్శనంగా నిలుస్తోంది.

పదేళ్లక్రితం మూతపడిన హాస్టల్

మొదట్లో హాస్టల్ విద్యార్థులతో కళకళలాడేది. అయితే కాలక్రమేణా విద్యావ్యవస్థలో, సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన మార్పులతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. చుట్టుపక్కల గ్రామాల్లో పలు ప్రైవేటు పాఠశాలలు ఏర్పాటు కావడం, ప్రాథమికోన్నత పాఠశాలు ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయ్యాయి. దీంతో హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. సాంఘిక సంక్షేమ శాఖలో వచ్చిన నూతన నిబంధనల మేరకు హాస్టల్‌లో నిర్దేశించిన సంఖ్య కన్నా తక్కువ విద్యార్థులున్న హాస్టల్‌లను మూసివేశారు. 2015 సంవత్సరం వరకు కాస్త అటు ఇటుగా నడిచిన హాస్టల్ 2015లో పూర్తిగా మూతపడింది.

పట్టించుకోని అధికారులు

పదేళ్లుగా మూతపడిన హాస్టల్ భవనాన్ని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదు. దీంతో హాస్టల్ భవనం ఆవరణలో పెద్ద ఎత్తున పిచ్చిమొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరింది. దాని తోడు కొందరు స్థానికులు అందులోనే పశువులను కట్టేస్తుండగా పశువుల కొట్టంగా మారుతుంది. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ భవనం ఏళ్ల తరబడి నిరుపయోగంగా శిథిలావస్థకు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవతో స్పందించి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

అంబేడ్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు సరికాదు

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్



జనగామ రూరల్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

జనగామ రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని, వాటిని వెంటనే ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల శేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి అమిత్‌షా దిష్టి బొమ్మల దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు తుటి దేవదానం, మబ్బు ఉప్పలయ్య పల్లెర్ల లలిత, గద్దం యాదగిరి, మారపాక రమేశ్, ఎండీ హతియా సుల్తానా, బొట్ల శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

కొడకండ్ల: అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని ఎస్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు దేశగాని హరగోపాల్‌గౌడ్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఎస్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆయన దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కోలు నరేష్, బండారి సోమన్న, సాయి, హర్షవర్ధన్, తరుణ్, కిరణ్, వీరూనాయక్‌లు పాల్గొన్నారు.

నియామకం



ప్రభాకర్

జనగామ: టీఎన్జీఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పేర్వారం ప్రభాకర్‌ను నియమిస్తూ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ముజీబ్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన జిల్లా టీఎన్జీఓ అధ్యక్షుడు ఖాజా షరీఫ్, రాష్ట్ర నాయకులు, ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పెండెల శ్రీనివాస్, సాంబారి నాగార్జున, సభ్యులు ప్రభాకర్‌ను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు పాటుపడాలి

- డీఈఓ రమేశ్



స్టేషన్‌ఘన్‌పూర్: దుప్పట్లు పంపిణీ చేస్తున్న డీఈఓ

స్టేషన్‌ఘన్‌పూర్: వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బాధ్యతగా పనిచేయాలని డీఈఓ రమేశ్ అన్నారు. నమిలిగొండలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. చలి తీవ్రత అధికంగా ఉండటంతో సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా విద్యార్థులకు దుప్పట్లు అందజేశామన్నారు. జీసీడీఓ గౌసియాబేగం, ఎస్‌ఓ రజిత, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

తరిగొప్పుల: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్, జీసీడీఓ గౌసియా బేగం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా చలికాలం దృష్ట్యా ప్రభుత్వం అందించిన దుప్పట్లను విద్యార్థులకు అందజేశారు. చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు దుప్పట్లను సకాలంలో అందించాలనే భావనతో వారికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు డీఈఓ తెలిపారు. ప్రత్యేక అధికారి సునీత పాల్గొన్నారు.

కేజీబీవీలో..

చిల్పూరు: రాజవరంలోని కేజీబీవీలో విద్యార్థులకు డీఈఓ రమేశ్ దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదవాలని అన్నారు.

బచ్చన్నపేట: హాస్టళ్లలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని మండల విద్యాధికారి ఇర్రి వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ విద్యార్థులకు ఆయన దుప్పట్లను పంపిణీ చేశారు.

ప్రొటోకాల్‌పై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

తరిగొప్పుల: స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ప్రొటోకాల్‌పై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వగలబోయిన యాదగిరి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డబ్బులు కుమ్మరించి గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధిని మరిచారని, పదవి లేకపోయినా డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తన శాయశక్తులా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తున్నారని అన్నారు. పార్టీ అధికారంలో ఉండి, ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి మద్దూరు మండలాన్ని, చేర్యాలను సిద్దిపేట జిల్లాలో కలుపుతుంటే ఏం చేశారని విమర్శించారు. ఇప్పుడు చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలనడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కోట్ల నిధులు తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామశాఖ అధ్యక్షుడు పండుగ కనుకయ్య, కల్వ రాజు, భీమా నాయక్, పోషిరెడ్డి,లూకా, ఎడ్ల నవీన్, భూక్య మాన్ సింగ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న జీపీ సిబ్బంది

- జీపీ సిబ్బంది వినతి

రఘునాథపల్లి: గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం మండల పరిషత్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మగోని రాజేష్ మాట్లాడుతూ ఈ నెల 17న ఇందిరాపార్కు వద్ద ధర్నాకు వెళ్తున్న పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ ధర్నా చేపట్టామన్నారు. అదే విధంగా ఈ నెల 27, 28 తేదీల్లో మండల పరిషత్ ముందు ధర్నా కార్యక్రమాలు చేపట్టనున్నామని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశామన్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ కారోబార్లు, వాటర్‌మెన్‌లు, ఎలక్ట్రీషన్, సఫాయి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి నల్ల రాజయ్య, రాపోలు రాజ్‌కుమార్, ఎండీ ఈసు మియా పాల్గొన్నారు.

తెలంగాణలో ప్రభుత్వ ఏర్పాటే బీజేపీ లక్ష్యం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి



పాలకుర్తి టౌన్: మాట్లాడుతున్న దశమంతరెడ్డి

పాలకుర్తి టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటే బీజేపీ లక్ష్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శివం గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్ అధ్యక్షతన శక్తి కేంద్రం ఇన్‌చార్జీల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ సంస్థాగత నిర్మాణంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులై పనిచేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దొంగలు మహేందర్, నిరంజన్, కమ్మగాని శ్రీకాంత్‌గౌడ్, ఉపేందర్‌రెడ్డి, మారం రవి, దేవరాజ్ పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయాలి

జనగామ రూరల్: బీజేపీని బలోపేతం చేయాలని పార్లమెంట్ కో కన్వీనర్ కొంతం శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు లద్దునూరి మహేష్ ఆధ్వర్యంలో గురువారం పార్టీ బూత్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో బూత్ కమిటీలు వేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. బూత్ అధ్యక్షుడిగా మారబోయిన రాజమల్లి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు మార్క ఉపేందర్, షవీన్ కుమార్, గద్దం శ్రీనివాస్, విద్యాసాగర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రఘునాథపల్లి: కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఊడ్గుల రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని మండలగూడెంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్ అధ్యక్షతన జరిగిన బూత్ కమిటీ ఎన్నికల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రతి మూడు సంవత్సరాలకోసారి సంస్థాగత ఎన్నికల్లో భాగంగా బూత్ అధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ గ్రామాన బీజేపీ బలోపేతానికి బూత్ కమిటీలు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం 131 బూత్ అధ్యక్షుడిగా పిట్టల రజనీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బండి ఉదయ్‌కిరణ్, 132వ బూత్ అధ్యక్షుడిగా ద్యాగల రాజన్న, ప్రధాన కార్యదర్శిగా బత్తిని అరవిండ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు గాదె ఉపేందర్, జిల్లా కార్యదర్శి అఖిల్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, గుజ్జుల సత్యనారాయణ, జయరాం పాల్గొన్నారు.

వంగాలపల్లిలో..

చిల్పూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సభ్యత్వాల నమోదుతోపాటు పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ నాయకుడు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు అన్నారు. వంగాలపల్లిలో పార్టీ సభ్యత్వాలు, బూత్‌ల వివరాలను తెలుసుకున్నారు. రమేశ్, నూనె సదానందం, నవీన్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యం'

రఘునాథపల్లి: కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఫతేషాపూర్ శివారులో కార్యకర్తల సమక్షంలో పూర్తి స్థాయి కాంగ్రెస్ గ్రామశాఖ కమిటీని ఎన్నుకున్నారు. గ్రామశాఖ ఉపాధ్యక్షుడిగా పెంటగట్టు మల్లు, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి యాదగిరి, సహాయ కార్యదర్శులుగా మారోజు లక్ష్మీనారాయణ, నీల సంపత్, కోశాధికారి బాల్నె పరశురాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, జిల్లా నాయకులు మేకల నరేందర్, జనగామ మార్కెట్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



బచ్చన్నపేట: సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్

బచ్చన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలో తమ్మడపల్లి గ్రామంలో చేపట్టిన ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్ రావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనాథ్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అర్హులకే చెందాలి

తరిగొప్పుల: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు నిజమైన అర్హులకే చెందాలని తహసీల్దార్ మోర నాగేశ్వరాచారి అన్నారు. మండలంలోని వాచ్య వెంకట్ తండా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఒక్క దరఖాస్తును వదలకుండా సర్వే చేయాలని ఆదేశించారు. జీపీ కార్యదర్శి లింగం, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాషా, భాస్కర్, వెంకటేష్, సుమన్ పాల్గొన్నారు.

నిలువ నీడలేని పేదలను గుర్తించేందుకే సర్వే

దేవరుప్పుల: నిలువ నీడలేని పేద కుటుంబాలను గుర్తించేందుకే ఇంటింటా సర్వే చేస్తున్నట్టు ఎంపీడీఓ కె.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వాస్తవిక స్థితిగతులు తెలుసుకునేందుకు చేపట్టిన సర్వేను లకావత్‌తండాలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. సర్వేను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఉపాధి హామీ ఏపీఓ కమ్మగాని శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి జిలుకర వెంకన్న ఉన్నారు.

సరుకుల పంపిణీ



జనగామ: మండలంలోని శామీర్‌పేట శివారు కోమటిరెడ్డి సుశీలమ్మ-రుద్రమాదేవి అనాథ ఆశ్రమంలో గురువారం పట్టణానికి చెందిన ఎండబట్ల నర్సింగరావు దేవేంద్ర దంపతుల కుమార్తె, డిగ్రీ కళాశాల లెక్చరర్ ఎండబట్ల మానస జన్మదిన వేడుకలను వయో వృద్ధులతో కలిసి జరుపుకున్నారు. కేక్ కట్ చేసిన అనంతరం అన్నదానం చేసి, నిత్యావసర సరుకులను అందించారు. ఆశ్రమం అధ్యక్షుడు లక్ష్మణ్, ఇన్‌చార్జ్ దేవేందర్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

డాక్టర్ వి.రఘుబాబు

లింగాలఘణపురం: పాడి రైతులు పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి వి.రఘుబాబు కోరారు. గురువారం మండలంలోని కుందారంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖల ఆధ్వర్యంలో దూడల ప్రదర్శన నిర్వహించారు. అంతేకాకుండా పశువైద్య శిబిరం నిర్వహించి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఓ రఘుబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేవలం ఆడ దూడలే పుట్టే విధంగా అభివృద్ధి చేసిన సెక్స్ సార్టెడ్ సెమన్ (లింగ నిర్ధారణ వీర్యం)తో ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. ఈ సందర్భంగా పాడి రైతులకు ప్రోత్సాహకంగా పాల క్యాన్‌లను బహుమతిగా అందజేశారు. డాక్టర్లు భగవాన్‌రెడ్డి, శిల్పతో పాటు గోపాలమిత్రలు వీరస్వామి, రమేస్, యాకుబ్, శోభన్‌బాబు వైద్య సేవలు అందించారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- మాలమహానాడు నాయకులు



బచ్చన్నపేట: పోలీసు స్టేషన్‌లో నాయకులు

కొడకండ్ల: అక్రమ అరెస్టులతో మాలమహానాడు ఉద్యమాన్ని అపలేరని మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల వెంకన్న అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో మాల మహానాడు మండల అధ్యక్షుడు జవ్వాజి ప్రవీణ్, ఉపాధ్యక్షుడు సోమన్న, నర్సయ్యలు ఉన్నారు.

అరెస్టు చేయడం అన్యాయం

బచ్చన్నపేట: ఎస్సీ వర్గీకరణతో మాలలకు జరిగే అన్యాయాన్ని అడగడానికి వెళ్తున్న మాలలను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ మల్యాల బాలీనర్సయ్య అన్నారు. గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మాలలను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తమ్మడి మహేందర్, చెవుల రాజేష్, మల్యాల సురేష్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

సన్మానం

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.750 కోట్ల నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ పట్టణ అధ్యక్షుడు నీల శ్రీధర్ గురువారం డివిజన్ కేంద్రంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. సీహెచ్.నరేందర్‌రెడ్డి, శిరీష్‌రెడ్డి, గట్టయ్య, సోమన్న, సంపత్ , కుమారస్వామి, నీల నర్సింహులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఆర్‌ఐకి..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని తహసీల్‌లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న పాసిల్ల ఆంధ్రయ్య సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై పాలకుర్తికి బదిలీ అయ్యారు. కాగా, గురువారం ఆయనను కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్ రెడ్డి, నాయబ్ తహసీల్దార్ లచ్చునాయక్ సిబ్బంది పాల్గొన్నారు. కాగా, పదోన్నతి పొందిన ఆంధ్రయ్య స్థానంలో ఎంఆర్‌ఐగా బదిలీపై వచ్చిన వి.నరేష్‌బాబును కలెక్టరేట్‌కు అటాచ్ చేయడం గమనార్హం.

ఏపీజీవీబీ.. టీజీబీగా మార్పు

బచ్చన్నపేట: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు ఇక నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారనుందని ఆ బ్యాంకు మేనేజర్ గురుప్రీత్‌సింగ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్రం ఆదేశాల మేరకు ఏపీజీవీబీ ఇక నుంచి టీజీబీగా జనవరి 1వ తేదీ నుంచి కొనసాగనుందని చెప్పారు. కావున బ్యాంకు అన్ని లావాదేవీలు ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఇందుకు ఖాతాదారులు సహకరించాలని ఆయన కోరారు. ఫీల్డ్ ఆఫీసర్ అనుషా, క్యాషియర్ పవన్‌కృష్ణ, ఆకాంక్ష పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

జఫర్‌గఢ్: ఈ నెల 29న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఏదునూరి రమేశ్, ప్రధాన కార్యదర్శి కొలిపాక రాములు, గౌరవ అధ్యక్షుడు రావర్తి యాకయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని నాయకులు, రజక కులస్తులు మహాసభల వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు.


ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలి

జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా కన్వీనర్ కోడెం కుమారస్వామి, ఎంఈఓ రాజేందర్ అన్నారు. ఉద్యోగులు చేపట్టిన నిరవధిక దీక్షలకు వారు గురువారం మద్దతు తెలిపి మాట్లాడారు. పది రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఉద్యగులను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు గడ్డం మనోజ్‌కుమార్, డాక్టర్ కల్నల్ భిక్షపతి, జరసం నాయకులు జి.కృష్ణ సంఘీభావం ప్రకటించారు.

ఉపాధ్యాయులకు డబ్బులు చెల్లించాలి

పాలకుర్తి: ప్రజాపాలన సర్వే విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు డబ్బులు చెల్లించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ సర్వే విధులు పూర్తి చేసి 20 రోజులు దాటినప్పటికి ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఉపాధ్యాయులకు అందలేదన్నారు. డబ్బులు చెల్లించాలని ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేయాలని ఆయన కోరారు.

పాఠశాలకు వాటర్ ప్లాంట్ అందజేత



బచ్చన్నపేట: దబ్బగుంటపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలకు దాత వాటర్ ప్లాంట్‌ను అందించినట్లు హెచ్‌ఎం అమీర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన మడిషెట్టి సత్యనారాయణ ఆయన తండ్రి ఉప్పలయ్య జ్ఞాపకార్థం రూ. 20 వేల విలువైన వాటర్ ప్లాంట్‌ను అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదు

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన రైతు మూడెకరాల ఆయిల్‌పామ్ తోట దగ్ధానికి కారకుడైన వ్యక్తిపై చర్య తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గాదె వెంకటరత్నం తన పొలంలో ఆయిల్‌పామ్ సాగు చేశాడు. పొలం పక్కన ఉన్న రైతు మారపాక పోషయ్య అతని వరికొయ్యలకు నిప్పంటించి ఆయిల్‌పామ్ తోట కాలిపోవడానికి కారకుడయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్సై రామ్‌చరణ్ తెలిపారు. దీనిపై విచారణ జరిపి బాధ్యుడిపై కేసు నమోదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

మీరాబాయి వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థిని

పాలకుర్తి: మండలంలోని గూడూరు పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థిని అమూల్య.. కవయిత్రి మీరాబాయి వేషధారణలో ఆకట్టుకుంది. కాగా, చౌడూరులో పని చేస్తున్న ఉపాధ్యాయుడు బి.కుమారస్వామి విద్యార్థిని వేషధారణకు తగినట్టు మీరాబాయి చిత్రాన్ని గీసి హెచ్‌ఎం చేతుల మీదుగా అమూల్య బహూకరించారు. హెచ్‌ఎం శైలజ, కుమార్, శ్రీనివాస్, మంజుల, సంజీవ్, శంకర్ పాల్గొన్నారు.